
సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం ၊ 5 ၊ జూలై ၊ 2023



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 3,465 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కుడి కాల్వ, ప్యాకేజీ-10కి సైతం నీరు వెళ్తోంది. మిడ్‌మానేరులో 17.64 టీఎంసీల నీరు ఉంది.



రాజీవ్ రహదారి రక్తసిక్తం

తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని రాజీవ్‌రహదారి నెత్తురోడింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను ట్రాక్టర్, మరో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఠాణా నుంచి దొంగల పరార్?

సిరిసిల్లక్రైం: ఆలయంలో దొంగతనానికి పాల్పడినట్లు ఆరోపణలున్న ఇద్దరు దొంగలను పోలీసులు ఠాణాకు తరలించారు. రాత్రి కావడంతో కస్టడీలో భాగంగా ఠాణాలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కానీ వారిద్దరూ పోలీసుల కళ్లుగప్పి పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. జిల్లా కేంద్రంలోని ఓ ఆలయంలో దొంగతనం జరిగినట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు ఈ నెల 1న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి విషయాలను రాబట్టేందుకు ప్రయత్నం చేశారు. కస్టడీలో భాగంగా ఇరువురు పోలీసులు వారికున్న సౌకర్యాలతో ఇద్దరిని ఒక స్థలంలో ఉంచారు. కానీ దొంగలిద్దరూ అక్కడి నుంచి చాకచక్యంగా పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసు అధికారులు సీరియస్ కావడంతో ఎలాగోలా ఒకరిని పట్టుకుని కటకటాలకు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. మరో దొంగ ఆచూకీ కోసం వెతుకులాట మూడు రోజులుగా సాగుతోందని పోలీసుల్లో చర్చ జరుగుతోంది. కాగా కేసు నమోదై, దొంగలు పరారైన సమాచారం బయటకు రాకుండా, పోలీసుల మధ్య ఉండేలా ఓ అధికారి తెగ ప్రయత్నాలు చేసిన విషయం ఆ నోటా ఈ నోటా బయటకు వచ్చింది. కాగా సదరు దొంగల వివరాలను పోలీసు అధికారులు ఎప్పుడు వెల్లడిస్తారో వేచిచూడాల్సిందే.

మెనూ విస్మరిస్తే చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

సిరిసిల్ల: ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలని, మెనూ విస్మరిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ ఎస్.భీమ్యానాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ముస్తాబాద్ మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు వారానికి మూడుసార్లు గుడ్లు అందించాలని, నిబంధనల మేరకు భోజనాన్ని రుచికరంగా పెట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో బన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహంకాళి వేడుకల్లో టీపీటీడీసీ చైర్మన్



చేనేత మగ్గంపై మంత్రి శ్రీనివాస్‌యాదవ్, గూడూరి ప్రవీణ్ తదితరులు

సిరిసిల్ల: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాఢమాస ఉత్సవాల్లో తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీపీటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్ పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి మంగళవారం చేనేత మగ్గంపై అమ్మవారికి సమర్పించే చీర తయారీని పరిశీలించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని 167 ఆలయాలకు ప్రభుత్వం రూ.1.13కోట్లు మంజూరు చేయగా, చెక్కులను మంత్రి, ప్రవీణ్ పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా 'ఆరోగ్య మహిళ'

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రతీ వారం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు మంగళవారం తెలిపారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీఏసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యారోగ్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాల్లో ఓపీడీ 401, బ్రెస్ట్ 395, ఓరల్ కావిటీ 395 పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కా కుండా యూటీఐ 2, ల్యాబ్ 68, థైరాయిడ్ 43, విటమిన్ డీ 13, సీబీపీ40, సూక్ష్మ పోషకాలు 25 మందికి పరీక్షలు నిర్వహించి వీరిలో ముగ్గురిని జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు.

ఎక్సైజ్ 'నిద్ర'పోతోంది..!



ఈఫొటోలో ఉన్నది ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్. ఇక్కడ ప్రధాన రహదారిలోనే షెటర్‌లో స్టేషన్ కొనసాగుతుంది. ఈ స్టేషన్ పరిధిలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాలు ఉన్నాయి. ఎక్కడ ఎక్సైజ్ శాఖకు సంబంధించి అక్రమాలు జరిగినా వెంటనే వెళ్లి అక్రమార్కులను పట్టుకోవాలి. ఇందు కోసం ప్రభుత్వం వాహన వసతి కూడా కల్పించింది. కానీ ఇక్కడి అధికారులు, సిబ్బంది ఒక్కరైనా అందుబాటులో లేకుండా ఇలా స్టేషన్ షెటర్‌కు తాళం వేసి ఇళ్లలో నిద్రిస్తున్నారు.



ఇది సిరిసిల్ల సర్దార్‌నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్. మంగళవారం వేకువజామున 5.30 గంటలకు ఇలా మూసి వేసి, తాళం వేసి ఉంది. ఈ స్టేషన్‌లో ఒక్క సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఏడుగురు కానిస్టేబుళ్లు, ఒక్క జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తారు. నిజానికి ఎక్సైజ్ స్టేషన్‌లో సెంట్రీ, నైట్‌డ్యూటీ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి. ఎక్కడ అక్రమ సారా రవాణా లేదా గంజాయి రవాణా జరిగినట్లు సమాచారం అందినా వెంటనే స్పందించి వెళ్లాలి. అక్రమార్కులను పట్టుకోవాలి. కానీ జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా ఏకంగా ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం వేసి అధికారులు, సిబ్బంది ఇళ్లలో హాయిగా నిద్రపోతున్నారు. చట్టవిరుద్ధమైన అక్రమాలు రాత్రి వేళల్లో జరిగిపోతున్నాయి.



ఇది వేములవాడ మార్కెట్ ప్రాంతంలోని ఎక్సైజ్ స్టేషన్. ఇక్కడ మాత్రం గేటుకు తాళం వేయలేదు. కానీ మూసి ఉంచారు. స్టేషన్‌లో లైట్లు వేసి ఉన్నాయి. సిబ్బంది కూడా ఉన్నట్లు సందడి కనిపించింది. స్టేషన్ ముందు వాహనం ఉంది. కానీ గేటు మూసి వేయడం గమనార్హం. కనీసం వేములవాడ ఎక్సైజ్‌స్టేషన్‌లో సిబ్బంది ఉండడం విశేషం.

- అబ్కారీ స్టేషన్లకు తాళం.. విధులకు దూరం
- సెంట్రీ లేరు.. రక్షణ లేదు
- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి మత్తు
- నాటు సారా జోరు
- తనిఖీలు లేవు.. పట్టింపు ఉండదు.. పట్టుకుంది లేదు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (అబ్కారీ) శాఖ పరిధిలో సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, వేములవాడ ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. నిజానికి పోలీస్ స్టేషన్ తరహాలోనే ఎక్సైజ్ శాఖ అధికారులు నిరంతరం నిఘా ఉంచి అక్రమ సారా, గంజాయి, కల్తీ కల్లు, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలి. వారి జాబ్ చార్ట్ ప్రకారం ఇంకా చాలా విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ మొక్కుబడిగా విధులు నిర్వహిస్తూ అక్రమ దందాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిజానికి జిల్లాలో గంజాయి అమ్మకాలు, రవాణాను ఎప్పటికప్పుడు పోలీసులు పట్టుకుంటూ కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇటీవలి కాలంలో అనేక గంజాయి కేసులు నమోదయ్యాయి. గంజాయిని కట్టడి చేయాల్సిన అబ్కారీ శాఖ పట్టించుకోవడం లేదు. కనీసం 24 గంటల పాటు ఎక్సైజ్ స్టేషన్‌ను తెరిచి ఉంచే పరిస్థితి లేదు.

మద్యం ధరలు తగ్గించని వ్యాపారులు..

రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను ఇటీవల కొద్దిగా తగ్గించింది. కానీ జిల్లాలో వ్యాపారులు మాత్రం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తున్నారు. ఇది ఏం పద్ధతి అని అడిగితే.. 'మా వద్ద ఇంకా పాత స్టాక్ ఉంది. మీకు ఇష్టముంటే తీసుకోండి లేకుంటే లేదు' అంటూ దోపిడీ చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణదారులు ఇచ్చే మామూళ్లకు ఆశపడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. మరోవైపు జిల్లాలోని అన్ని ఊర్లలో బెల్ట్‌షాపులు ఉన్నా.. ఒక్కటి కూడా లేదని నిస్సిగ్గుగా ఎక్సైజ్ అధికారులు అధికారికంగా నివేదించారు.

నివాసాలు ఎక్కడో..

జిల్లాలోని అబ్కారీ శాఖ, మూడు ఎక్సైజ్ స్టేషన్లలో పని చేసే అధికారులు, సిబ్బంది కనీసం హెడ్‌క్వార్టర్లలో (పని చేసే చోట) నివాసం ఉండకుండా సొంత ఊర్లలో ఉంటున్నారు లేదా కరీంనగర్, హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉంటూ మొక్కుబడి విధులు నిర్వహిస్తున్నారు. అబ్కారీ శాఖపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల ఆజమాయిషీ లేకపోవడంతో ఇష్టానుసారంగా జాబ్ చార్ట్‌కు తూట్లు పొడుస్తున్నారు.

జిల్లాలో అబ్కారీ స్వరూపం

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్	01
ఎక్సైజ్ స్టేషన్లు	03
వైన్స్ షాపులు	48
రెగ్యులర్ బార్లు	06
ఎలైట్ బార్లు	02
బెల్ట్ షాపులు(అనధికారికంగా)	522

స్టేషన్లలో సిబ్బంది ఉండాల్సిందే..

ఎక్సైజ్ స్టేషన్లలో సిబ్బంది ఉండాల్సిందే. ఉంటారు కూడా. రాత్రి వేళల్లో గేటుకు తాళం వేసి లోపల ఉంటారు. రాత్రి వేళ ఏమైనా అవసరమైతే పిలిస్తే లేస్తారు. ఎక్సైజ్ శాఖ పరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు జిల్లాలో తీసుకుంటున్నాం. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం.

– పంచాక్షరి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, రాజన్న సిరిసిల్ల

పోరాట కెరటం దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అరుణ, భీమ్యానాయక్

సిరిసిల్ల: తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట కెరటమని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వెనకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తూ ఆయన పోరాటాన్ని గుర్తు చేస్తుందన్నారు. అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ మాట్లాడుతూ, తెలంగాణలో రైతులపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య పోరాడి అమరుడు అయ్యాడని వివరించారు. కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్ ఏవో బి.గంగయ్య, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాఘవేందర్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీపీవో పీబీ.శ్రీనివాసాచారి, డీపీవో భాస్కర్, డీపీఆర్వో ఎం.దశరథం, బీసీ సంఘాల నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన లిటరసీ క్విజ్ పోటీల్లో దుమాల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎస్.ఐశ్వర్య, ఆర్.అభిషేక్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు శిక్షణ ఉపాధ్యాయులు బి.శ్రీకాంత్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ కదిరె రజిత, వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కొడుకులు బువ్వ పెడుతలేరు సారు..

- ఠాణా దివస్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్‌కు మొరపెట్టుకున్న వృద్ధ దంపతులు



సమస్యలను ఎస్పీకి చెబుతున్న వృద్ధ దంపతులు

ఇల్లంతకుంట(మానకొండూర్): 'కొడుకులు బువ్వ పెడుతలేరు సారు'.. అంటూ ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. మంగళవారం ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ఠాణా దివస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా మండలంలోని నర్సక్కపేటకు చెందిన వృద్ధ దంపతులు భూమని భూమయ్య-లచ్చవ్వ.. తమకు ఇద్దరు కొడుకులు ఉన్నారని ఎవరూ బువ్వ పెట్టడం లేదని, ఏదైనా ఆధారం చూపించాలని లేదా కొడుకులు అన్నం పెట్టేలా చూడాలని ఎస్పీకి విన్నవించారు. వెంటనే ఎస్పీ స్పందిస్తూ వృద్ధ దంపతుల కొడుకులకు కౌన్సెలింగ్ నిర్వహించి సమస్యను పరిష్కరించాలని సీఐ ఉపేందర్, ఎస్సై రాజేశ్‌ను ఆదేశించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..


జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లలో ప్రతినెలా మొదటి వారంలో ఒక రోజు ఠాణా దివస్ నిర్వహించి ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఎస్పీ అన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, దూర ప్రాంతాల నుంచి తన కార్యాలయానికి రాలేని వారి వద్దకే పోలీస్ సేవలు అందాలనే ఉద్దేశంతో ఠాణా దివస్ ఏర్పాటు చేశామని వివరించారు. ఠాణా దివస్‌లో 56 మంది వివిధ సమస్యలపై ఎస్పీని కలిసి ఫిర్యాదులు అందజేశారు. వెంటనే పరిష్కరించాలని సీఐ, ఎస్సైలను ఆదేశించారు. తమ పరిధిలో లేని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యే వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. భూ తగాదాల్లో క్రిమినల్ సమస్య ఉన్న ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించామని, సివిల్ సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలన్నారు. దాని కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ వారితో అవగాహన కల్పిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

వంతెన నిర్మాణానికి నిధులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రం, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై వంతెన నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈమేరకు మంగళవారం గంభీరావుపేట సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులు వంతెన నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించారు. వంతెన నిర్మాణమైతే మండల ప్రజల దశాబ్దాల కల నెరవేరి రవాణా కష్టాలు తీరనున్నాయి.

నెలాఖరులోగా పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి




గురుకులం విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు– మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ముస్తాబాద్, బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూరిబా విద్యాలయం, బాలుర గురుకుల విద్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెలాఖరులోగా మన ఊరు– మనబడి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. బందనకల్‌లో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు గుడ్లు అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ నిర్వాహకులు కోడిగుడ్లను వెంటనే సరఫరా చేయాలని, జిల్లాలోని ఏజెన్సీలను పిలిచి మాట్లాడాలని డీఈవోను ఆదేశించారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాలుర వసతి గృహానికి రూ.5.9 లక్షలు మంజూరు చేశామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్యాక్స్ గోదాంను పరిశీలించి ఎరువులు, యూరియా నిల్వలను తెలుసుకున్నారు. విక్రయాలు, స్టాక్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఈవో రమేశ్, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, తహసీల్దార్ మునీందర్, ప్రత్యేకాధికారి శ్రీలత తదితరులు ఉన్నారు.

సైలెన్సర్లు ధ్వంసం


సిరిసిల్లక్రైం: అధిక శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్స్ అమర్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనాల సైలెన్సర్లను మంగళవారం పోలీసులు రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. అబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ చర్యను స్థానికులు వింతగా వీక్షించారు. అనంతరం ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారం నెలరోజుల్లో జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి భారీ శబ్దాలు చేసేలా సైలెన్సర్లను కలిగి ఉన్న 55 వాహనాలను సీజ్ చేశామని, జరిమానా విధించినట్లు వెల్లడించారు. ఇలాంటి సైలెన్సర్లను వాహనాలకు బిగించే మెకానిక్‌లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శబ్దకాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను బిగించి రెండోసారి పట్టుబడిన వాహనదారులపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ఐలు రాజు, దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డురోలర్ కింద సైలెన్సర్లు

కొంచెం మోదం.. ఎంతో ఖేదం





- పార్టీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ది తిరుగులేని ముద్ర
- పాదయాత్రలు, అరెస్టులతో జాతీయస్థాయిలో చర్చ..
- బండిని తప్పించడంపై జిల్లా నేతల అసంతృప్తి
- త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి ఎంపీ బండి సంజయ్?
- చేరికల కమిటీ చైర్మన్‌గా ఇంతకాలం ఈటల కినుక
- చివరికి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి విషయంలో పార్టీలో కొంతకాలంగా సాగుతున్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. కరీంనగర్ ఎంపీగా పార్టీ అధ్యక్షుడిగా ఇంతకాలం బీజేపీకి తిరుగులేని విజయాలు అందించిన బండి సంజయ్ స్థానంలో కిషన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీచేసింది. జిల్లా నుంచి పెద్దలీడర్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పించినా.. మరో కీలక పదవి కూడా ఇదే జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను వరించింది. ఇంతకాలం చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటలను రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి కల్పించింది. బండిని తప్పించడం, ఈటలకు పదోన్నతి కల్పించడం వంటి పరిణామాలతో పార్టీ, 'బండి' వర్గంలో తీవ్ర నిస్తేజం నెలకొనగా.. ఈటల వర్గంలో కొత్త ఉత్సాహం మొదలైంది. మొత్తానికి పార్టీలో జిల్లా నేతలకు పదవులు మారినా.. అధిష్టానం వద్ద పట్టునిలుపుకోవడంలో కరీంనగర్ నాయకులు మరోసారి సత్తా చాటుకున్నట్లయింది.

ఫలించిన ఈటల మంత్రాంగం..!

జిల్లాలో సీనియర్ మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది సుదీర్ఘ రాజకీయ అనుభవం. టీఆర్‌ఎస్‌లో చేరి అనతికాలంలో కేసీఆర్‌కు కుడిభుజంలా మారారు. తెలంగాణ ఉద్యమంలో ఈటల రాజేందర్ పాత్ర ప్రజలందరికీ తెలిసిందే. 2004లో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రస్థానంప్రారంభించిన ఈటల రాజేందర్ ఆపై వెనుదిరిగి చూసుకోలేదు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో రాష్ట్రంలో మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది తిరుగులేని రికార్డు. ఇందులో 2008, 2009, 2010లో ఏడాదికి ఒకసారి చొప్పున అసెంబ్లీకి గెలుస్తూ హ్యాట్రిక్ సాధించారు. 2021లో మరో ఉపఎన్నికలో విజయం సాధించి అత్యధిక ఉప ఎన్నికలు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సొంతంచేసుకున్నారు.

- 2021లో అనూహ్య పరిస్థితుల మధ్య టీఆర్‌ఎస్‌ను వీడిన రాజేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి విజయం సాధించారు. బీజేపీలో చేరికల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి రాజేందర్‌ను పార్టీ అధ్యక్షపదవి వరిస్తుందనుకున్నా.. జరగలేదు. ఈ క్రమంలో ఆయన అధిష్టానంపై ఒత్తిడి ప్రారంభించారు. బండికి వ్యతిరేకంగా సీనియర్లను కూడగట్టేందుకు యత్నించారు. ఒకదశలో పార్టీని వీడుతారని ప్రచారం జరిగింది. మొత్తానికి రాజేందర్ వ్యూహం ఫలించింది. పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించడంతో ఈటల వర్గీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బండిని తప్పించడంపై నిరాశ..

బీజేపీకి కొత్త ఊపు తీసుకువచ్చిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఒక సంచలనం. సంఘ్ పరివార్ నేపథ్యమున్న బండి 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా అనూహ్య విజయం సాధించారు. 2020లో రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టిన బండి సంజయ్ పార్టీకి కొత్త జోష్ నింపారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలి ఉపఎన్నిక దుబ్బాకలో బండి సంజయ్ నేతృత్వంలో పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా విజయం సాధించి రికార్డు సృష్టించింది. అనంతరం బండి తన దూకుడును జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అదేస్థాయిలో కొనసాగించారు. ఏకంగా 46 కార్పొరేటర్ స్థానాల్లో కాషాయజెండా ఎగరేసి అధికార పార్టీకి చెమటలు పట్టించారు. 2021 హుజూరాబాద్ ఎన్నికలోనూ ఈటల రాజేందర్ గెలుపుతో బండి గ్రాఫ్ మరింత పెరిగింది. 2022 జనవరిలో 317 జీవోకి వ్యతిరేకంగా బండి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడం జాతీయస్థాయిలో చర్చ జరిగింది. ఇటీవల పదో తరగతి పేపర్ లీకేజీలు, భైంసా సభ సమయంలోనూ బండిని పోలీసులు అరెస్టు చేయడం రాష్ట్రవ్యాప్తంగా కేడర్‌ను ఏకంచేశాయి. 2022 మునుగోడు ఉపఎన్నికల్లోనూ బీజేపీ చివరి వరకు పోరాడింది. ప్రజాసంగ్రామ యాత్రలతో కేవలం తన పార్లమెంటు సెగ్మెంటుకే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించారు. అప్పటిదాకా 10 శాతంగా ఉన్న బీజేపీ ఓటు షేర్‌ను 34.5 శాతానికి పెంచారు.

త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి..

అదే సమయంలో బండి జిల్లాలో సీనియర్లను కలుపుకొనిపోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌ని నేటికీ నియమించకపోవడంపైనా పలు ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో పార్టీలో నగర అధ్యక్షుడిని నియమించకుండా ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, సెంట్రల్ అంటూ జోన్లు విభజించి ఎవరికీ పట్టు దక్కనీయలేదని విమర్శలు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో బండి నిర్ణయాలను సమర్థించే ఫాలోవర్లకు కొదవ లేదు. బండిని అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియా హోరెత్తి పోతోంది. నగర పశ్చిమ డివిజన్ కార్యవర్గం రాజీనామా చేయడం గమనార్హం. రెండు మూడురోజుల్లో బండి సంజయ్‌ని కీలక పదవి వరించనుందని సమాచారం. కేంద్ర కేబినెట్‌లో బండికి చోటుదక్కనుందని పార్టీ వర్గాల సమాచారం.

క్లుప్తంగా

రాజన్న సేవలో 'బలగం' నటుడు



వేములవాడ: బలగం మూవీలో పెద్దకొడుకు పాత్రధారుడు ఐలయ్య, తెలంగాణ డ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కొరియోగ్రాఫర్ పాప్‌చిక్ శ్రీధర్‌లు మంగళవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు అందించి, సన్మానించారు. వారి వెంట డ్యాన్సర్లు తాళ్లపల్లి నాగరాజు, గంగ శ్రీకాంత్ ఉన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ కోరారు. ఈ మేరకు మంగళవారం బోయినపల్లి ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు గౌరవ వేతనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ పెంచినట్లు ప్రకటించిన డబ్బులు సైతం ఇంకా బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి టెండర్లు

సాక్షి ఎఫెక్ట్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఏళ్లతరబడి రోడ్డు కోసం ఎదురుచూస్తున్న తమ కష్టాలు ఎట్టకేలకు తీరబోతున్నాయని చింతలఠాణ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'రూ.కోట్ల నిధులున్నా.. పాట్లు తప్పడం లేదు' శీర్షికతో 'సాక్షి'కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు టెండర్ ప్రకటన జారీ చేశారు. చీర్లవంచ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నుంచి చింతలఠాణ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వరకు బీటీరోడ్డు నిర్మాణానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు.

అధికారులకు నోటీసులు

సాక్షి స్పందన

వేములవాడరూరల్: వేములవాడ మార్కెట్‌కమిటీ యార్డులో 'ఎండిపోయిన మొక్కలు' అనే కథనం గత నెల 13న 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరారు. ఈ నోటీసును అందుకున్న ఎంపీడీఓ రాంరెడ్డి తమ పరిధి కాదని, మార్కెట్ కార్యదర్శికి పంపించారు. ఆయన కూడా తమ పరిధిలో జరగలేదంటూ మున్సిపల్ కమిషనర్‌కు నోటీసును పంపించారు. కాగా కథనంపై బాధ్యులెవరో కానీ కలెక్టర్ కోరిన వివరణ మాత్రం మూడు శాఖల అధికారులకు వెళ్లడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు.

రాజీవ్ రహదారి రక్తసిక్తం

- ట్రాక్టర్ ఢీకొని ముగ్గురు యువకుల దుర్మరణం
- మరో వాహనం సైతం ఢీకొన్నట్లు అనుమానం
- మృతులది చిగురుమామిడి మండలం రామంచ
- రాంగ్‌రూట్ కారణంగా ప్రమాదం
- గ్రామంలో విషాదఛాయలు



ప్రమాదస్థలంలో మృతుల ద్విచక్రవాహనం



అంజి (ఫైల్)



సంపత్ (ఫైల్)



అర్వింద్ (ఫైల్)

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని రాజీవ్‌రహదారి రక్తసిక్తమైంది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, మరో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన పైడిపల్లి అర్వింద్ (23) శివరాత్రి సంపత్ (21), శివరాత్రి ఆంజనేయులు (25) ద్విచక్రవాహనంపై తిమ్మాపూర్ మండలం రేణికుంట సమీపంలో రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్దకు వచ్చారు. సమీపంలోని దాబాలో భోజనం చేద్దామనుకున్నారు. కానీ.. దాబా క్లోజ్‌చేసి ఉండడంతో తిరిగి రామంచ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అర్వింద్ అక్కడికక్కడే మృతిచెందగా, అంజి , సంపత్ చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున మరణించారు.

ఇసుక ట్రాక్టరేనా?

రేణికుంట సమీపంలోని మానేరువాగు నుంచి రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ వాగులో నుంచి రాజీవ్ రహదారిపైకి రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ ఢీకొన్న సమయంలో మరో గుర్తుతెలియని వాహనంకూడా బైక్‌ను ఢీకొన్నట్లు పోలీసు అనుమానిస్తున్నారు. నిర్లక్ష్యంగా రాంగ్ రూట్ లో నడిపిన ట్రాక్టర్ డ్రైవర్ అజయ్, ఓనర్ మహేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు.

వారం రోజుల్లో దుబాయ్ వెళ్లాల్సి ఉండగా..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి అంజి ఇంటికి పెద్దవాడు అతని ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు మల్లయ్య, లక్ష్మీ వ్యవసాయం తో పాటు కూలీ పనులు చేసుకుంటారు. అంజి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి కుదరకపోవడంతో ఈనెల 24న తిరిగి దుబాయ్ వెళ్లాలనుకున్నాడు. టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో మత్యువు కబళించింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఒక్కడే కొడుకు..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి సంపత్ ఒక్కడే కొడుకు. తల్లిదండ్రులు మహేందర్, రేణుక వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతుండగా, సంపత్ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. చేతికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు కంటతడిపెట్టిస్తున్నాయి.

డ్రైవర్‌గా పనిచేసిన అర్వింద్..

గుడ్డిపెల్లి అర్వింద్‌కు తమ్ముడు చెల్లె ఉన్నారు. అతని తల్లిదండ్రులు రాజు, శైలజ. తండ్రి మహేందర్ ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తుండగా తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఎదిగిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల కలిచివేశాయి.

గ్రామంలో విషాద ఛాయలు...

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడడంతో గ్రామస్తులు విషాదంలో మునిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసి తిరిగిన స్నేహితులు చనిపోయారనే వార్త నమ్మలేకపోతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

నీటిలో ముంచి.. ఊపిరి తీసి

- స్నానం కోసం వరద కాలువలోకి తీసుకెళ్లిన భర్త
- భార్యపై అనుమానంతో హత్య



షబానా బీ(ఫైల్)



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

కోరుట్ల: భార్యను అనుమానించి వరదకాలువలో ముంచి చంపాడు ఓ భర్త.. అంతటితో ఆగకుండా నేరం నుంచి తప్పించుకునేందుకు పుట్టింటికి పంపానని అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన ఈ ఘాతుకాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఇర్ఫానా బేగం భర్త అజీజ్ కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఇళ్లలో పలు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతోంది. ఏడాదిక్రితం తన కుమార్తె షబానాబీ(21)ని కోరుట్లలోని గంగంపేటలో ఉండే జమీర్(28)కు ఇచ్చి వివాహం జరిపింది. కొద్దిరోజుల తర్వాత షబానాను అనుమానిస్తూ వచ్చిన జమీర్.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో షబానాను జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించి పుట్టింటికి పంపానని తన అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. సాయంత్రం వరకూ కూతురు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇర్ఫానాబేగం.. కోరుట్లకు వచ్చింది. కూతురు తన ఇంటికి రాలేదని జమీర్‌ను అడిగింది. అయితే, తాను బస్సు ఎక్కించానని, ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియదని తప్పించుకున్నాడు. దీంతో అదేరోజు రాత్రి కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఇర్ఫానా ఫిర్యాదు చేసింది. పోలీసులు జమీర్‌ను విచారణ జరపగా.. షబానాను కోరుట్ల బస్టాండ్‌లోనే జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించానని చెప్పాడు. ఆ సమయంలో బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించగా ఆ దృశ్యాలేమీ లభించలేదు. దీంతో జమీర్‌ను అనుమానించిన పోలీసులు.. గట్టిగా ప్రశ్నించడంతే.. తానే షబానాను సోమవారం ఉదయం కథలాపూర్ మండలం భూషన్‌రావుపేట శివారులోని వరదకాలువ వద్దకు తీసుకెళ్లానని, స్నానం చేద్దామని లోనికి తీసుకెళ్లి నీటిలో ముంచి చంపానని అంగీకరించాడు. దీంతో మంగళవారం సాయంత్రం సీఐ ప్రవీణ్‌కుమార్, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు కిరణ్, కిరణ్‌కుమార్ వరద కాలువ వద్దకు వెళ్లి నీటిలో గాలించారు. దీంతో షబానా మృతదేహం లభ్యమైంది. షబానాపై అనుమానంతో భర్త జమీర్ చంపినట్లు సీఐ ప్రవీణకుమార్ తెలిపారు.

యువతి కిడ్నాప్ కథ సుఖాంతం

- పెళ్లి చేసుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్



శ్రీనివాస్–మౌనిక పెళ్లి ఫొటో

చందుర్తి(వేములవాడ): రెండు జిల్లాల పోలీసులకు సవాల్‌గా మారిన యువతి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. కిడ్నాప్ చేసిన ఆమెను పెళ్లి చేసుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా రామగుడు మండలంలోని మోతె గ్రామానికి చెందిన మౌనికను రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మెరుపుల శ్రీనివాస్ మరో నలుగురు యువకులతో కలిసి గత శనివారం రాత్రి కిడ్నాప్ చేసినట్లు బాధితురాలి తల్లి మల్లవ్వ రామగుడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారితోపాటు చందుర్తి పోలీసులు మౌనిక ఆచూకీ కోసం శని, ఆదివారాల్లో తీవ్రంగా గాలించారు. అంతేకాకుండా ఆ యువతి బంధువులు 20 మందికి పైగా వీరి కోసం వెతికారు. ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. ఏ క్షణంలో ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఎన్గల్ గ్రామస్తులు ఆందోళన చెందారు. చివరికి మూడు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ మౌనిక–శ్రీనివాస్‌ల పెళ్లి ఫొటోలు మంగళవారం ఎన్గల్ గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వైరల్ అయ్యాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

- టాటాఏస్‌ను ఢీకొన్న ఆటో
- చందుర్తి–మల్యాల మధ్య ఘటన



రుతిక మృతదేహం

చందుర్తి(వేములవాడ): ఆటోను టాటాఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో ఓ బాలిక మృతిచెందింది. చందుర్తి ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. కోరుట్ల పట్టణానికి చెందిన రాగుల రుతిక(14) తన కుటుంబసభ్యులతో కలిసి సోమవారం వేములవాడలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లింది. మంగళవారం ఆటోలో తిరుగుపయనమయ్యారు. చందుర్తి–మల్యాల గ్రామాల మధ్య కోళ్ల ఫారం మూలమలుపు వద్ద నిర్మల్ నుంచి వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనానికి ప్రయాణికులతో వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రుతిక తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన టాటాఏస్ డ్రైవర్ వాహనంతో సహా పారిపోగా సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తండ్రి లేడు.. తల్లి వదిలేసి పోయింది

- 18 నెలల పసిపాప దీనస్థితి
- పూరి గుడిసెలో పింఛన్ డబ్బులతో సాకుతున్న నానమ్మ
- ఆరోగ్యం సహకరించడం లేదంటూ కన్నీరు
- మంత్రి కేటీఆర్, దాతలు సాయం చేయాలని వేడుకోలు



చిన్నారితో సావిత్రి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కట్టుకున్న భర్త అనారోగ్యంతో చనిపోయాడు.. అతను లేని పాప తనకెందుకని అనుకుందో ఏమో.. 18 నెలల చిన్నారిని వదిలేసి, ఆ తల్లి ఎక్కడికో వెళ్లిపోయింది. చెట్టంత కొడుకు చనిపోవడం.. అండగా ఉంటుందనుకున్న కోడలు జాడలేక పోవడంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న నానమ్మే పింఛన్ డబ్బులతో పాపను సాకుతోంది. ఇల్లు, రేషన్ కార్డు లేవని, దాతలు ఆదుకోవాలని వేడుకుంటోంది. వివరాలిలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన అగుళ్ల భాస్కర్(26) ఇదే గ్రామానికి చెందిన జాహ్నవిని పెళ్లి చేసుకున్నాడు. వీరికి అహిద్య జన్మించింది. కానీ భాస్కర్ అనారోగ్యంతో ఐదు నెలల క్రితం మృతిచెందాడు. నెల రోజులకే జాహ్నవి పాపను తన తల్లి సావిత్రి వద్ద వదిలేసి, వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ ఇప్పటివరకు తెలియలేదు. పూరి గుడిసెలో ఉంటున్నానని, తనకు కాళ్ల నొప్పులతో ఆరోగ్యం సహకరించడం లేదని, మనవరాలిని సాకడం ఇబ్బందిగా ఉందని సావిత్రి కన్నీరు పెట్టుకుంటోంది. రేషన్ కార్డు కూడా లేదని, రూ.2 వేల పింఛన్ డబ్బులే దిక్కని విలపిస్తోంది. వీరి దీనస్థితిని చూసిన గొల్లపల్లి సర్పంచ్ పాశం సరోజన రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. చిన్నారిని పెంచేందుకు దాతలు ఆపన్నహస్తం అందించాలని, మంత్రి కేటీఆర్ తమకు ఇల్లు ఇప్పించాలని సావిత్రి కోరుతోంది. సాయం చేయాలనుకునేవారు మిట్టపల్లి శేఖర్ ఫోన్ నంబర్ 90009 96122(ఫోన్ పే)కు డబ్బులు పంపించాలని వేడుకుంటోంది.

న్యూట్రిషన్ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే న్యూట్రిషన్ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రతినెలా మొదటి బుధవారం గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార దినోత్సవం జరుపుకోవాలని సూచించారు. ఆరోగ్య లక్ష్మి పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ, సీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ గంగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వర్షం.. హర్షం



వేములవాడ/వేములవాడరూరల్: వేములవాడలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. నాలుగు రోజులుగా భానుడి ప్రతాపంతో బెంబేలెత్తిపోయిన జనం వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. పత్తి విత్తనాలు, వరినార్లు వేసి దుక్కులు సాగు చేసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్త పింఛన్.. కోడలి వంచన

- మూడేళ్లుగా డబ్బులు కాజేస్తున్న కోడలు
- మున్సిపల్ ఎదుట సొమ్మసిల్లిన అవ్వ
- తలకు తీవ్రగాయాలు



అనసూయమ్మ



వృద్ధురాలిని ఓదార్చుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: కట్టుకున్నోడు ఏళ్ల కింద కాలం చేశాడు. పెళ్లి వయస్సు రాకముందు పెద్దకొడుకు.. పెళ్లయినంక చిన్నకొడుకు అనారోగ్యంతో చనిపోయారు. అప్పట్నుంచి చిన్న కోడలే ప్రపంచమని బతుకుతున్న ఓ అత్తను కోడలు బురిడీ కొట్టిస్తుంది. అత్త ఆస్తితో పాటు వృద్ధాప్య పింఛన్‌ను మూడేళ్లుగా కాజేస్తున్న ఘటన ఇది. బాధితురాలి వివరాల మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గాంధీనగర్‌కు చెందిన పత్తిపాక అనసూయమ్మకు ఇద్దరు కొడుకులు. భర్త 40 ఏళ్ల క్రితం చనిపోగా, ఇద్దరు కొడుకులను పెంచి ప్రయోజకులను చేసింది. పెద్దకొడుకు పెళ్లికాకముందే చనిపోగా, చిన్నకొడుక్కు పెళ్లి చేసింది. వారే లోకంగా అనసూయమ్మ బతుకుతుండగా పదేళ్ల క్రితం చిన్నకొడుకు చనిపోయాడు. ఇదే అదనుగా చిన్న కోడలు భాగ్య అత్తపేరున ఉన్న ఆస్తిని రాయించుకుని పెన్షన్ వచ్చే అకౌంట్ ఏటీఎం కార్డును తన వద్ద ఉంచుకుంది. నెలనెలా వచ్చే పింఛన్ డబ్బులను మూడేళ్లుగా డ్రా చేస్తుంది. పింఛన్ తెచ్చుకోవాలని అనసూయ అడిగితే రావడం లేదని చెబుతూ వచ్చింది. ఈక్రమంలో మందులకు డబ్బులు లేకపోవడంతో పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆ వృద్ధురాలు బోరున విలపిస్తూ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అక్కడే గేట్ ఎదుట సొమ్మసిల్లి పడిపోగా, తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి వృద్ధురాలి బాధను విన్నాడు. అధికారులను వాకబు చేయగా, నెలనెలా అనసూయ అకౌంట్‌లో పెన్షన్ జమవుతుందని చెప్పడంతో కోడలు బండారం బయటపడింది. తలకు దెబ్బతాకడంతో వెంటనే అనసూయను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. టౌన్ సీఐ అనిల్‌కుమార్ కోడలుకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరినీ ఇంటికి పంపించారు. కాగా ఆ అవ్వ బాధను విన్న స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

'బీజేపీతోనే దేశాభివృద్ధి'



సిరిసిల్లటౌన్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ తమిళనాడు రాష్ట్ర సీనియర్ నాయకుడు దామోదరన్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ బూత్ అధ్యక్షుల సమావేశం మంగళవారం జరిగింది. ఈకార్యక్రమానికి దామోదరన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీతోనే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సిరిసిల్లలో 80 బూత్‌లకు గాను 60 బూత్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ ఆడేపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కార్యదర్శి కైలాస్, కొండ నరేష్, ఎనగంటి నరేష్, ఉపాధ్యక్షుడు చొప్పదండి అంజన్న, మోర శ్రీహరి, సదానందం, రమేష్‌చారి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని సారంపల్లి శివారులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ బి.ఉపేందర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన గడ్డం నగేశ్ సారంపల్లి శివారులో మంగళవారం గంజాయి విక్రయిస్తుండగా తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి తన సిబ్బందితో వెళ్లి, అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి 1,550 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైతోపాటు పోలీస్ సిబ్బంది నరేందర్, తిరుపతి, శ్రీనివాస్, రామ్మోహన్, రాజేంద్రప్రసాద్, స్వామిలను సీఐ అభినందించారు.

పదోతరగతి విద్యార్థిని బలవన్మరణం

ముస్తాబాద్(సిరిసిల్ల): చదువుకునే వయసులో సెల్‌ఫోన్ వాడొద్దని తల్లి మందలించిందుకు ఓ పదోతరగతి విద్యార్థిని ప్రాణాలు తీసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని (15) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తరచూ సెల్‌ఫోన్ వాడుతోంది. ఈ క్రమంలో ఓ ఇంటర్ విద్యార్థి ఆమెకు సంబంధం లేకున్నా అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టాడు. వాటిని చూసిన విద్యార్థిని తల్లి సెల్‌ఫోన్ వాడొద్దంటూ ఆమెను మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి ఆ విద్యార్థిని మంగళవారం స్నానం చేసేందుకు బాత్‌రూంకి వెళ్లి, చీరతో ఉరేసుకుంది. చదువులో ఎప్పుడూ ముందుండే బాలిక అర్ధంతరంగా తనువు చాలించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి దుబాయ్‌లో ఉండగా.. కూతురి చివరిచూపు కోసం స్వగ్రామం బయల్దేరాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్య తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారులపై చర్య తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లు యజమాని, వేములవాడకు చెందిన ఓ వ్యక్తి పేదల అవసరాలను ఆసరాగా చేసుకొని, 10 శాతం వడ్డీకి అప్పులిస్తున్నాడని ఆరోపించారు. ఇలాంటి వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బాధ్యత ఎవరిది?


- అధికారుల సమన్వయ లోపం
- కిందిస్థాయి ఉద్యోగులకు శాపం



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు (ఫైల్)

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణ విషయంలో అధికారుల మధ్య సమన్వయ లోపం విద్యార్థులు, కిందిస్థాయి ఉద్యోగులకు శాపంగా మారింది. దీంతో విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులకు విషయం తెలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇలాంటి విధానంతోనే ముస్తాబాద్ మండలంలోని ఓ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సంబంధిత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ల సరఫరా జరగడం లేదని బహిర్గతమైంది. దీనికి కారణాలు తెలిపాలని వెంటనే అడిషనల్ కలెక్టర్‌కు ఆదేశించారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి, ఆ మండలం ఎంఈవో, నోడల్ ఆఫీసర్‌తో మధ్యాహ్న భోజన నిర్వహణ తీరుపై ఆరా తీసినట్లు తెలిసింది. అసలు మధ్యాహ్న భోజన అందించడానికి చేసిన ఖర్చు రెండు నెలలుగా కార్మికులకు అందలేదని, గౌరవ వేతనాన్ని పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులు అమలు కావడం లేదని కార్మికులు సమ్మెకు వెళ్తున్నట్లు ఈ నెల 2న వినతిపత్రాన్ని డీఈవో కార్యాలయంలో అందించినట్లు సమాచారం. కాగా సమ్మె విషయం తన దృష్టి రాలేదని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈవోలను డీఈవో ఆదేశించినట్లు తెలిసింది. కానీ కార్మికులు సమ్మెకు వెళ్తున్నట్లు డీఈవోకు వినతిపత్రం అందించిన ఫొటోలు జిల్లాలోని పలు ఉపాధ్యాయ సంఘాల సామాజిక గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. మధ్యాహ్న భోజనానికి అవసరమైన సరుకుల సరఫరాకు టెండర్ పిలవాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలున్న వాటి అమలులో ఉన్నతాధికారులు తాత్సారం చేస్తూ పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులను, కార్మికులను విద్యార్థుల తల్లిదండ్రుల ముందు దోషిగా నిలిపేలా చూస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అధికారుల తీరును తప్పు పడుతున్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా రగుడు చౌరస్తా నుంచి విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ.5,300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, హాస్టల్ మెస్ చార్జీలు పెంచాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ప్రశాంత్, విద్యార్థులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ASTROLOGY

■ శ్రీసాయిబాబా జ్యోతిష్యాలయం విద్య ఉద్యోగం వివాహం ఆరోగ్యం స్త్రీప్రేమ ఆర్థిక దాంపత్య సమస్యలు సంతానఫలం స్త్రీ పురుషుల వశీకరణం ఎటువంటి సమస్యలైనా 3రోజులలో పరిష్కారం చేయగలరు. ✆ 9740627373. [O-769023]

WANTED

■ Wanted Female TeleCallers for Credit Cards Sales. Qlf: Any Degree. Salary: 8,000 - 10,000/- Immediatly Cont: 9963490087. [WA-863]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221195]

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21,000/- + రూం+ భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816. [WA-6995]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

■ VISA Consultation overseas Blue & White Colour Jobs. All Profiles Lucrative. Salary High Pay. Interview 3rd to 5th July Hyd & 8 to 11 July Vizag. Ph: 9717618737 [HA-3070]

www.sakshi.com

■ అద్భుత అవకాశం Hyd లో గల మా సంస్థయందు డోర్ టు డోర్ సర్వే చేయుటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. ఫిక్స్‌డ్ సాలరీ+ కమీషన్, రూం+భోజనం ఉచిత వసతి కలదు. 10th, ఇంటర్, డిగ్రీ, పాస్/ఫెయిల్ వారు సంప్రదించండి. ఫోన్ : 7989371766, 7013191934 [H-780893]

■ హైదరాబాద్ ఏరియాలో పనిచేయడానికి హెల్పర్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. చదువు లేకున్నా జాబ్. జీతం: 18 నుండి 20 వేలు వసతి కలదు. Ph: 8096309212 [H-781393]

■ Wanted req. IndusInd, HDFC Banks Loan Recovery boys. Field & Sales Managers & Work from Home female Telicallers Credit Cards Sal: 25K - 47K forwards to Wapp 6281159171 [HA-30187]

■ ఓల్డ్ రికార్డ్ చూసి న్యూ రికార్డ్ రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12మంది కావలెను. ప్రతిరోజు ఆదాయం. వివరాలకు సంప్ర: 9948925364. [W-785676]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:

9951602933, 9951602824